క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

చుండూరు(వేమూరు): మరమ్మతులు నిమిత్తం బుధవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని మండల విద్యుత్ శాఖ ఏఈ దోనేపూడి అర్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. చుండూరు సబ్ స్టేషన్ పరిధిలోని 11కేవీ వేటపాలెం ఫీడర్ పరిధిలోని నడిగడ్డపాలెం, వేటపాలెం, తోటపాలెం, కె.ఎస్ పల్లిలో విద్యుత్ లైనులు మరమ్మతులు చేపట్టడం జరుగుతుందన్నారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయడం జరుగుతుందని, వినియోగదారులు సహకరించాలని పేర్కొన్నారు.

రిక్షా కార్మికులకు రెయిన్ కోట్లు పంపిణీ



రేపల్లె రూరల్: పట్టణంలోని పలువురు రిక్షా కార్మికులకు ఎన్ఆర్ఐ పరుచూరి శ్రీనాథ్ సహకారంతో సీఐటీయూ ఆధ్వర్యంలో మంగళవారం రెయిన్ కోట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మణిలాల్ మాట్లాడుతూ వర్షం కారణంగా రిక్షా కార్మికులు ఉపాధి కోల్పోకూడదని రెయిన్ కోట్లు ఇవ్వడం అభినందనీయమన్నారు. 25 మంది కార్మికులకు రెయిన్‌కోట్లు అందజేశారు. సీఐటీయూ నాయకులు ధర్మరాజు, రిక్షా వర్కర్స్ యూనియన్ నాయకులు వెంకటేశ్వరరావు, రాంబాబు, రంగారావు పాల్గొన్నారు.

రాజధాని నిర్మాణానికి సాయం హర్షణీయం

బాపట్ల: ఏపీ అభివృద్ధిపై బీజేపీ ప్రభుత్వం చిత్తశుద్ధితో ముందుకు వెళ్తోందని భారతీయ జనతా పార్టీ నాయకుడు, మాజీ శాసనమండలి సభ్యుడు అన్నం సతీష్ ప్రభాకర్ మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. బడ్జెట్ సమావేశంలో ఏపీ రాజధాని అభివృద్ధికి రూ.15 వేల కోట్ల సాయం ప్రకటించడంపై హర్షం వ్యక్తం చేశారు. సాధ్యమైనంతవరకు పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించటం సంతోషకరమని తెలిపారు. అదేవిధంగా రాయలసీమ, ఉత్తరాంధ్ర, ప్రకాశం అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించారని, విశాఖ-చెన్నై ఓర్వకల్లు-బెంగళూరు పారిశ్రామిక కారిడార్ కు నిధులు కేటాయిస్తున్నట్లు ప్రకటించడం గొప్ప విషయమని పేర్కొన్నారు.

నేడు భట్టిప్రోలులో ప్రజా వేదిక

భట్టిప్రోలు: మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో (ఎన్ఆర్ఈజీఎస్) గత ఏడాది జరిగిన సామాజిక తనిఖీలో భాగంగా బుధవారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయ ఆవరణలో ప్రజా వేదిక నిర్వహించనున్నట్లు ఎంపీడీవో జెబీవీ మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సామాజిక తనిఖీలో భాగంగా ఈ నెల 16 నుంచి 23వ తేదీ వరకు గ్రామ సభలు జరిగాయని పేర్కొన్నారు. ప్రజా వేదికలో ఆయా గ్రామాల్లో వెలుగు చూసిన అంశాలను వివరించనున్నట్లు తెలిపారు. ఏడాది కాలంగా గ్రామాల్లో చేసిన పనులను సామాజిక తనిఖీ బృందాలు పరిశీలించి తదనుగుణంగా కూలీలను కలిసి జాబ్ కార్డులు తనిఖీ చేయడం, ఎన్ని రోజులు పనిచేశారనేది విచారించి నమోదు చేసుకుంటారని పేర్కొన్నారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు నిర్వహించిన పనులపై సామాజిక తనిఖీ చేపట్టినట్లు వివరించారు.

వెద సాగు పొలాల పరిశీలన



అబ్బనగూడవల్లి(వేమూరు): అధిక వర్షాలకు మునిగి పోయిన వరి వెద సాగు పొలాల్లో నీటిని బయటకు పంపించేందుకు రైతులు చర్యలు తీసుకోవాలని బాపట్ల జిల్లా వ్యవసాయాధికారి వై.రామకృష్ణ అన్నారు. వేమూరు మండలంలోని అబ్బనగూడవల్లి గ్రామాల్లో మంగళవారం ఆయన పర్యటించారు. మునిగి పోయిన పొలాలు గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అధిక వర్షాలు వల్ల విత్తనం మొలక శాతం నష్టపోకుండా పొలాల్లో నీటిని బైటికి తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి చందోలు సునీత, రైతుల పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

గుంటూరు రూరల్: యువతి అదృశ్యంపై నల్లపాడు పోలీసులు మంగళవారం కేసు నమోదు చేశారు. సీఐ వంశీధర్ తెలిపిన వివరాల ప్రకారం ఎన్జీవో కాలనీ, 12వ లైను నల్లకుంటకు చెందిన రేపూడి సుమ ఈ నెల 21వ తేదీన ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదని తండ్రి రేపూడి ఎలీషా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. యువతికి 20 సంవత్సరాలు ఉంటాయని, మతి స్థిమితం లేదని ఆచూకి తెలిసిన వారు నల్లపాడు పోలీస్ స్టేషన్ 8688831376, 8688831590 నంబర్లకు తెలియజేయాలన్నారు.

బాపట్ల పట్టణంలోని రైలు పేటకు చెందిన కె.రమేష్ అనే 11 ఏళ్ళ బాలుడిపై గత 12 రోజుల క్రితం నాలుగు కుక్కలు ఒక్కసారిగా దాడిచేశాయి. ఈ దాడిలో తీవ్ర గాయాలపాలైన రమేష్‌ను చికిత్స నిమిత్తం బాపట్ల ఏరియా వైద్యశాలకు తీసుకెళ్లారు. చిన్నారిని నాలుగు విడతలుగా వైద్యశాలకు వచ్చి వైద్యం చేయించుకోవాలని సూచించారు. నాలుగు కుక్కలు ఒక్కసారిగా దాడి చేయడంతో తీవ్ర భయాందోళనకు చెంది ఒక్కసారిగా కుప్పకూలి పడిపోయారని చిన్నారి తల్లిదండ్రులు వాపోయారు.

బాపట్ల మండలంలోని ముత్తాయపాలెం గ్రామానికి చెందిన గవిని యామిని, వల్లు చంద్రిక, మద్దిబోయినవారిపాలెం గ్రామానికి చెందిన నాగరాజు, డ్రైవర్స్ కాలనీకి చెందిన మోహన్‌కుమార్ అనే చిన్నారులు ఇటీవల ఇంటి నుంచి ట్యూషన్‌కు, పాఠశాల నుంచి ఇంటికి వెళ్తున్న సమయంలో వారిపై కుక్కలు దాడిచేశాయి. తీవ్రంగా గాయపడిన వారిని వెంటనే వైద్యశాలకు తీసుకెళ్లి వైద్య సేవలందించారు. వారిని కుక్కలు కరిచి 20 రోజులు అవుతున్నా.. ఇప్పటికీ వైద్యశాలలకు వెళ్తూనే ఉన్నారు. గడిచిన 20 రోజులుగా రోజుకు 10పైగా కుక్కకాటుకు గురైన కేసులు వైద్యశాలకు వస్తున్నాయంటే కుక్కల స్వైర విహారం ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థమవుతోంది.

కనికరం మరచిన వీధి శునకం..

- హడలెత్తిస్తున్న వీధి కుక్కలు
- రోడ్లపై గుంపులు గుంపులుగా సంచారం
- చిన్నారులు, వృద్ధులపై పెరుగుతున్న దాడులు
- నియంత్రణలో మున్సిపల్ అధికారులు విఫలం
- అటకెక్కిన ఏబీసీ ప్రోగ్రాం



పాతబస్టాండ్ సెంటర్‌లో పుర ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న వీధి కుక్కలు

బాపట్లటౌన్: జిల్లా కేంద్రమైన బాపట్లలో వీధి కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. బాపట్ల పట్టణంలో ఉన్న 34 వార్డులు, మండలంలోని 25 పంచాయతీల్లో ఎక్కడ చూసినా వీధి కుక్కలు గుంపులు, గుంపులుగా రోడ్లపై తిరుగుతూ పిల్లలు, మహిళలు, వృద్ధులతో పాటు వాహనదారులను వెంబడించి పరుగులు పెట్టిస్తున్నాయి. రాత్రి వేళల్లో మనుషులు కనిపిస్తే చాలు దాడి చేసి గాయపరుస్తున్నాయి. పగటి పూట సైతం చిన్నారులు కనిపిస్తే దాడి చేసి గాయపరుస్తున్నాయి.

శునకాల బెడద తీరేదెప్పుడో..!

బాపట్లపట్టణం, మండలాల్లోని గ్రామాల సంగతి దేవుడెరుక..పట్టణంలో నిత్యం జనం రద్దీగా ఉండే ప్రాంతాలైన సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం, తహశీల్దార్ కార్యాలయం, పాతబస్టాండ్, పోలీస్‌స్టేషన్, ఎంజీరోడ్డు, భావన్నారాయణస్వామి దేవాలయం, సోమేశ్వరస్వామి దేవాలయం, రైల్వేస్టేషన్, చీలు రోడ్డు, వ్యవసాయ కళాశాల రోడ్డులతోపాటు డ్రైవర్స్‌కాలనీ, దేవునిమాన్యం, యాదవపాలెం ప్రాంతాల్లో రోజురోజుకు వీధి కుక్కల సంతతి పెరిగిపోతుంది. వివిధ అవసరాల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు చేరుకునేవారిపై వీధికుక్కలు విరుచుకుపడుతున్నాయి. దీంతో ప్రజలు కుక్కలు కనబడితేనే బెంబేలెత్తిపోతున్నారు.

రేబిస్ అంటే..

ఈ వ్యాధి సోకితే శరీరంలోని నరాల వ్యవస్థ మొత్తం దెబ్బతిని చివరికి ప్రాణాలు కోల్పోతారు. రేబిస్ సోకిన వారిలో కొందరు మంచినీళ్లు తాగడానికి కానీ, నీటిని చూడటానికి గానీ విపరీతంగా భయపడిపోతారు. ఈ లక్షణాన్ని వైద్య పరిభాషలో హైడ్రోఫోబియా అంటారు. రోగి నీళ్ల తాగకపోవడంతో డీహైడ్రేషన్‌కు గురై మరణం సంభవిస్తుంది.



విచ్చలవిడి వ్యర్థాలే కారణమా..?

పట్టణ ప్రాంతాల్లో ముఖ్యంగా ప్రధాన కూడలి ప్రాంతాల్లోని చికెన్, మటన్ దుకాణదారులు వాటి వ్యర్థాలను బహిరంగ ప్రదేశాల్లో విచ్చలవిడిగా పారేస్తుండటంతో అవి మాంసం, రక్తం రుచిని మరుగుతున్నాయి. వ్యర్థాలు లభించని సందర్భాల్లో మనుష్యులపై దాడికి పాల్పడుతున్నాయని పలువురు వాపోతున్నారు.

పేరుకే ఏబీసీ...అమలేదీ..?

1998కి ముందు మున్సిపాల్టీ పరిధిలోని సిబ్బంది కొంతమంది విచ్చలవిడిగా తిరుగుతున్న కుక్కలను వెంటాడి కర్రలతో కొట్టి చంపేవారు. ఆ తర్వాత జంతు ప్రేమికులు, పలు స్వచ్ఛంద సంస్థలు న్యాయస్థానాలను ఆశ్రయించడంతో వాటిని చంపడం నేరమని తీర్పునిచ్చింది. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వం ఓ ప్రత్యేక పథకం ద్వారా శునకాల సంతతి నియంత్రణకు శ్రీకారం చుట్టింది. అదే యాంటీ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) దీని ద్వారా పురపాలకసంఘాలు, గ్రామపంచాయతీల్లో వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేస్తారు. శస్త్రచికిత్సల్లో భాగంగా ఆడ కుక్కలకు గర్భసంచి తీసివేస్తారు. మగ కుక్కలకు క్యాస్ట్రేషన్ చేస్తారు. ఈ విధానం వలన కేవలం సంతాన నిరోధమే కాదు, అవి పెద్దగా అరవడం, కరవడాన్ని నియంత్రించవచ్చు. జిల్లాలో ఏబీసీ నామమాత్రంగానే మారింది.

కరిచిన వెంటనే వైద్యులను సంప్రదించాలి

కుక్క కరిచినపుడు గాయం తీవ్రతను బట్టి వైద్య చికిత్స ఉంటుంది. కుక్క కాటుకు గురైన వ్యక్తి మూడు లేదా ఐదు డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. సాధారణంగా కుక్క కాటుకు కరిచిన రోజు, మూడో రోజు, ఏడో రోజు వ్యాక్సిన్ ఇస్తారు. కుక్క కరిచినపుడు రక్తగాయమైతే అదనంగా 14వ రోజు, 28వ రోజు కూడా ఏఆర్‌వి డోసులు తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో పాటు ఇమ్యూనోగ్లోబిన్ ఇంజక్షన్లు వేస్తారు. దీని వల్ల తక్షణమే వ్యాధి నిరోధకశక్తి చేకూరుతుంది. రేబిస్ వ్యాధి చాలా ప్రాణాంతకం. వ్యాధి సోకితే చికిత్స లేదు. వీధి కుక్కలకు సాధ్యమైనంతవరకు దూరంగా ఉండాలి. వైద్యం పొందితే ఇబ్బందులు ఉండవు. – డాక్టర్ సిద్దార్థ, సూపరింటెండెంట్, బాపట్ల ఏరియా వైద్యశాల

చర్యలు తీసుకుంటాం

బాపట్ల పట్టణంలో వీధి కుక్కల సంతతి నివారణకు చర్యలు తీసుకుంటాం. గతంలో లానే ఏబీసీ విధానంలో వీధి కుక్కలకు శస్త్ర చికిత్సలు చేయించే కార్యక్రమాన్ని త్వరలో చేపడుతాం.

– నిర్మల్ కుమార్, కమిషనర్, బాపట్ల మున్సిపాలిటీ

అగ్నిహోత్రం శేషాచార్యులకు ఘన సత్కారం



అగ్నిహోత్రం శేషాచార్యులను సత్కరిస్తున్న ఫౌండేషన్ సభ్యులు

చెరుకుపల్లి: గురు పౌర్ణమి సందర్భంగా గురువులను సత్కరించుకోవటం సాంప్రదాయమని సమరసత సేవా ఫౌండేషన్ జిల్లా దేవాలయ ప్రముఖ్ పొన్నపల్లి సత్యన్నారాయణ అన్నారు. గురు పౌర్ణమి పురస్కరించుకొని జరుగుతున్న కార్యక్రమాల్లో భాగంగా ఆరేపల్లి శివాలయంలో మంగళవారం ఫౌండేషన్ ఆధ్వర్యంలో వ్యాస పూజ నిర్వహించారు. అనంతరం అర్ష విజ్ఞాననిధి బిరుదాంకితులు అగ్నిహోత్రం శేషాచార్యులను ఘనంగా సత్కరించారు. సందర్భంగా శేషాచార్యులు మాట్లాడుతూ మహాభారతం హిందూ ధర్మానికి అందించిన వ్యాస మహాముని ఆది గురువన్నారు. అదేవిధంగా ఆదిశంకరాచార్యులు, రామానుజాచార్యులు, మధ్యాచార్యులు, దత్తాత్రేయ, గురుదత్త వీరందరిని ప్రతి ఒక్కరూ నిత్యం పూజించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో పడమటి వెంకటేశ్వరరావు, ఉల్లంగుంట సాంబశివరావు జంజనం హేమశంకరరావు, ఉల్లంగుంట శివరామకృష్ణ, చింతల మురళి పాల్గొన్నారు.

అధిక ధరలకు ఎరువులు విక్రయించరాదు



కాకుమాను: ప్రభుత్వం నిర్ణయించిన ధరలకు ఎరువులు, విత్తనాలు విక్రయించాలని పొన్నూరు ఏడీఏ రామకోటేశ్వరి అన్నారు. మండల కేంద్రం కాకుమానులో మంగళవారం ఎరువులు, విత్తన దుకాణాలను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఖరీఫ్, రబీ సీజన్‌లో దుకాణ యజమానులు ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు, విత్తనాలు విక్రయించాలని ఆదేశించారు. నిబంధనలకు విరుద్ధంగా అధిక ధరలకు విక్రయిస్తే అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతి దుకాణంలో ధరల పట్టికను ఏర్పాటు చేయడంతో పాటు ఎరువులు, విత్తనాలు కొనుగోలు చేసిన ప్రతి రైతుకు రసీదు ఇవ్వాలని సూచించారు. అధిక ధరలకు విక్రయిస్తే రైతులు స్థానిక వ్యవసాయ అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆమె తెలిపారు. దుకాణాలలో ఉన్న స్టాకు వివరాలను పరిశీలించారు. ఏవో కె.కిరణ్మయి ఉన్నారు.

రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు లిటిల్ ఏంజెల్స్ విద్యార్థుల ఎంపిక



రాష్ట్రస్థాయి చెస్ పోటీలకు ఎంపికైన లిటిల్ ఏంజెల్స్ విద్యార్థులు

బాపట్లటౌన్: విద్యార్థి దశ నుంచే చదువుతోపాటు క్రీడల్లోనూ ప్రతిభ కనబర్చాలని లిటిల్ ఏంజెల్స్ స్కూల్ ప్రిన్సిపల్ సెబాస్టియన్ అన్నారు. బాపట్ల జిల్లా చెస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 22న అండర్-7, 11 విభాగాల్లో బాల బాలికలకు చెస్ పోటీలు నిర్వహించారన్నారు. అత్యుత్తమ ప్రతిభ కనపరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. బాలికల విభాగంలో 6వ తరగతి విద్యార్థి చెరుకుపల్లి వేద శ్రీనిధి ప్రథమస్థానం, బాలుర విభాగంలో 5వ తరగతి విద్యార్థి షేక్ రిజ్వాన్ అహ్మద్ ద్వితీయ స్థానం సాధించారన్నారు. వీరు ఈ నెల 27, 28 తేదీల్లో భీమవరంలో జరిగే రాష్ట్ర స్థాయి చెస్ పోటీల్లో జిల్లా తరఫున పాల్గొంటారని చెప్పారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను మంగళవారం పాఠశాలలో ప్రత్యేకంగా అభినందించారు.

ప్రతిభ చాటిన విజ్ఞాన్ డిగ్రీ కళాశాల విద్యార్థులు

గుంటూరు రూరల్ : ప్రతి విద్యార్థికి ఉపాధి కల్పనే లక్ష్యంగా తమ కళాశాల కృషి చేస్తోందని విజ్ఞాన్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ అనురాధ తెలిపారు. మంగళవారం పెదపలకలూరులోని కళాశాలలో లియోరా డిజిటల్ అమిగోస్ కంపెనీ ఆధ్వర్యంలో ఇంటర్న్‌షిప్‌కు ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అనురాధ మాట్లాడుతూ నైపుణ్యత కలిగిన విద్యా విధానం, ఆధునిక, సాంకేతిక పరిజ్ఞానంతో తమ కళాశాల విద్యార్థులు ఉపాధి పొందగలుగుతున్నారన్నారు. ప్లేస్‌మెంట్ అధికారి గోపాలకృష్ణ, ఇన్‌చార్జి రామిరెడ్డిలు మాట్లాడుతూ లియోగా డిజిటల్ అమిగోస్ సంస్థలో ఇంటర్న్‌షిప్ కోసం ప్రతిభ కలిగిన ఎనిమిది మంది విద్యార్థులు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన విద్యార్థులను డైరెక్టర్, ఆపరేషన్స్ మేనేజర్ అభినందించారు.

విద్యాదానం గొప్పది



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంఈఓ నిరంజన్

బాపట్ల: అన్నిదానాల కన్న విద్యాదానం గొప్పదని మండల విద్యాశాఖాధికారి ఎస్.నిరంజన్ పేర్కొన్నారు. మండలంలోని చెరువు జమ్ములపాలెం ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు ఎన్జీఓ అసోసియేషన్ కోశాధికారి పానకాల రాయుడు సౌజన్యంతో మంగళవారం నోట్ పుస్తకాలు పంపిణీ చేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఎం.ప్రకాశ్‌వర్ధిని అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంఈఓ నిరంజన్ పాల్గొన్ని విద్యార్థులకు పుస్తకాలు, పలకలు,పెన్నులు అందించారు. విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో దాత పానకాల రాయుడు, బాపట్ల రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ బి.ఎస్.నారాయణభట్టు, ఉపాధ్యాయులు జోగి శ్యామసుందరి, సొసైటీ అధ్యక్షులు కన్నెగంటి జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

భజన గురువు జొన్నలగడ్డ మృతి



వెంకట్రామయ్య (ఫైల్‌ఫోటో)

రేపల్లె రూరల్: భజన సమాజాలకు గురువుగా, నాటక కళాకారుడిగా అనేక సేవలు అందించిన సమరసత సేవా ఫౌండేషన్ మండల భజన ప్రముఖ్ జొన్నలగడ్డ వెంకట్రామయ్య(68) మంగళవారం మృతి చెందారు. సమాచారం తెలుసుకున్న ఫౌండేషన్ సభ్యులు ఆయన మృతదేహాన్ని సందర్శించి, నివాళులర్పించారు. నాటక రంగంలో అనేక పాత్రలను అవలీలగా ప్రదర్శించే వారని, బ్రహ్మంగారి నాటకంలో సిద్ధయ్య పాత్రను, హరిచంద్ర నాటకంలో నక్షత్రకుడు పాత్రలో ఒదిగి పోయేవారని గుర్తుచేసుకున్నారు. ఆంజనేయుడి పాత్రల్లో నటించి ఆ పాత్రలకే వన్నె తెచ్చారని కొనియాడారు. ఆయన మృతి నాటక రంగానికి తీరని లోటు అని విచారం వ్యక్తం చేశారు. నివాళులర్పించిన వారిలో సమరసత సేవా ఫౌండేషన్ సభ్యులు పేరం కోటేశ్వరరావు, జంజనం హేమశంకరరావు, కొంతి బాబూరావు, పడమట వెంకటేశ్వరరావు తదితరులున్నారు.

ఆంగ్లేయులకు సింహస్వప్నం ఆజాద్



బాపట్ల: బ్రిటిష్ పాలకులకు సింహ స్వప్నంగా మారిన చంద్రశేఖర్ ఆజాద్ యువతకు ఆదర్శనీయులని ఫోరం ఫర్ బెటర్ బాపట్ల కార్యదర్శి డాక్టరు పి.సి.సాయిబాబు పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్ 118వ జయంతి సందర్భంగా మంగళవారం స్థానికంగా ఉన్న విగ్రహానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. ఆంగ్లేయుల చేతికి చిక్క కూడదనే ఆలోచనతో, చివరకు బ్రిటిష్ పోలీసులు చుట్టుముట్టగా తనను తాను పిస్తోల్‌తో కాల్చుకొని, అమరుడయ్యారని తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ ప్రసాదరావు, న్యాయవాదులు జమ్మద్ బాష, టి.భాస్కర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

కృష్ణా నది పరీవాహక పొలాల పరిశీలన

వరదలొస్తే.. పంట నష్టంపై అంచనా



రైతులతో మాట్లాడుతున్న డీఏఓ రామకృష్ణ

కొల్లూరు: కృష్ణా నదికి వచ్చే వరదల కారణంగా పంట నష్టం వాటిల్లితే.. ప్రభుత్వం రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీ రూపంలో పరిహారం చెల్లించి అండగా నిలుస్తుందని జిల్లా వ్యవసాయ శాఖాధికారి రామకృష్ణ తెలిపారు. మంగళవారం మండలంలోని కృష్ణా నదీ పరివాహక లంక గ్రామాలను ఆయన సందర్శించారు. ప్రస్తుతం సాగులో ఉన్న పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా వ్యవసాయశాఖాధికారి మాట్లాడుతూ.. నదికి వరదలు సంభవించిన పక్షంలో నష్టపోయే పంటల వివరాలను రైతులను అడిగి తెలుసుకున్నారు. నదికి 5 లక్షల క్యూసెక్కుల పైబడి నీటి విడుదల అయిన పక్షంలో పంటలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని రైతులు వివరించారు. ఈ కార్యక్రమంలో రేపల్లె ఏడీఏ హుసేన్, ఏఓ ఆర్.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

చెరువులో గంబూసియా చేపలు విడుదల



చెరువులో చేపలు విడదల చేస్తున్న మలేరియా శాఖ అధికారులు

మోదుకూరు(వేమూరు): దోమలను అరికట్టేందుకు నీటిలో చేపలు విడదల చేస్తున్నట్లు మలేరియా సబ్ యూనిట్ అధికారి పిడికిలి నరేంద్ర పేర్కొన్నారు. చుండూరు మండలంలోని మోదుకూరు గ్రామ పంచాయతీ చెరువులో గంబూసియా చేపలు విడదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేరువులోని నీటిలో గాంబూసియా చేపలను విడదల చేస్తే దోమ గుడ్లు, లార్వాలు, ప్యూపాలను నియంత్రంచవచ్చన్నారు. అందు వల్ల దోమలు పెరుగుదలను అరికట్టి, దోమ కాటు వల్ల వచ్చే మలేరియా, డెంగీ, చికున్ గునియా, బోధకాలు, మెదడ వాపు వంటి కీటకజనిత వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని పేర్కొన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు జాగుంట రాంబాబు, బి.సాంబశివరావు, పంచాయతీ కార్యదర్శి శివరామ కృష్ణ, ఆరోగ్య సూపర్ వైజర్ అమర్నాథ్, రాజకుమారి పాల్గొన్నారు.

ఆజాద్, తిలక్‌కు ఘన నివాళి



ఆజాద్, తిలక్ చిత్రపటాలకు నివాళి

భట్టిప్రోలు: దేశ స్వాతంత్ర్యం కోసం చంద్రశేఖర్ ఆజాద్ చిన్న వయస్సులోనే ప్రాణాలు అర్పించిన ధీరోదాత్తుడని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధక్షుడు పి.మనోజ్ కుమార్ పేర్కొన్నారు. చంద్రశేఖర్ ఆజాద్, బాలగంగాధర్ తిలక్ జయంతిని పురస్కరించుకుని మంగళవారం భట్టిప్రోలు టీఎంరావు హైస్కూల్‌లో వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి, నివాళులర్పించారు. మనోజ్ కుమార్ మాట్లాడుతూ నాడు దేశ స్వాతంత్ర్యం కోసం ఆజాద్ బ్రిటీష్ వారిని తరిమి కొట్టడానికి ఎంతగానో కృషి చేశారన్నారు. ఎంఈఓ నీలం దేవరాజు మాట్లాడుతూ బాల గంగాధర్ తిలక్ స్వాతంత్ర్యం కోసం ప్రజలందరిని ఐక్యం చేయడానికి అనేక కార్యక్రమాలు నిర్వహించారని గుర్తుచేశారు. స్వరాజ్యం నా జన్మ హక్కు అనే నినాదాన్ని ఇచ్చి.. దేశాన్ని పరిపాలించుకుందామని హోమ్ రూల్ ఉద్యమాన్ని ప్రారంభించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో హై స్కూల్ ప్రధానోపాధ్యాయులు చందలూరి రామకోటేశ్వరరావు, సీఆర్పీ కృష్ణారావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

అక్రమ తూముల తొలగింపు



తూములు తొలగిస్తున్న అధికారులు

వేమూరు: మండల కేంద్రంలోని ప్రైవేటు లే అవుట్ నిర్వాహకులు ప్రభుత్వం అనుమతి లేకుండా ఆర్ అండ్ బీ తూములను తొలగించారు. పల్లె కొన గ్రామానికి చెందిన శేరు శ్రీనివాసరరావు ఆర్ అండ్ బీ రోడ్డు స్థలం పక్కన మూతపడిన రైస్‌మిల్లు స్థలం కొనుగోలు చేశాడు. అక్కడ లేఅవుట్ వేసి ఏడాదిన్నర అయ్యింది. అర్ అండ్ బీ అధికారుల అనుమతి లేకుండా పక్కన ఉన్న స్థలంలో నీరు బయటకు పోయేందుకు పెద్ద తూములు వేశారు. అదే గ్రామానికి చెందిన బీజేపీ నాయకులు ఈ మేరకు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో అర్ అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు లే అవుట్ వద్దకు మంగళవారం పరిశీలించారు. తూములను గుర్తించి, మార్కింగ్ వేశారు. పంచాయతీ అధికారులు యంత్రం ద్వారా పెద్ద తూములను తొలగించారు. లే అవుట్ నిర్వాహకుడికి సమాచారం అందించినా సమాధానం లేకపోవడంతో తూములు తొలగించినట్లు పంచాయతీ అధికారులు తెలిపారు.

సమాచార హక్కు చట్టంతో అవినీతికి అడ్డుకట్ట



సమాచార హక్కు చట్టంపై అవగాహన కల్పిస్తున్న ఏడీఏ అక్తర్ హుసేన్

కొల్లూరు : ప్రభుత్వ రంగ సంస్థల్లో చోటుచేసుకునే అవినీతి, అక్రమాలను అడ్డుకోవడానికి సమాచార హక్కు చట్టం సహకరిస్తుందని రేపల్లె వ్యవసాయ శాఖ సహాయ వ్యవసాయ సంచాలకుడు అక్తర్ హుసేన్ అన్నారు. మంగళవారం మండల ప్రజా పరిషత్తు సమావేశ మందిరంలో సామాచార హక్కు చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంస్థల్లో పారదర్శకత, జవాబుదారితనాన్ని పెంచేందుకు అమలులోకి తీసుకొచ్చిన సమాచారం హక్కు చట్టాన్ని ప్రతి ఒక్కరూ ప్రజా ఉపయోగాల కోసం సద్వినియోగ పరుచుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖల్లోని సంబంధిత అధికారులు సమాచార హక్కు చట్టంపై అందే దరఖాస్తు చేసుకుంటే.. త్వరితగతిన స్పందించి నిర్ణీత గడువులోపు అర్జీదారులు కోరిన సమాచారాన్ని అందించాలని సూచించారు. ఈ సమావేశంలో వ్యవసాయశాఖాధికారి ఆర్.వెంకటేశ్వరరావు, ఎంఈఓ-2 జ్యోతి, ఇరిగేషన్ ఏఈ సాంబశివరావు, ఈఓపీఆర్‌డీ రవిబాబు పాల్గొన్నారు.

కషాయాలతో చీడపీడల నివారణ



దశపర్ణి కషాయాన్ని తయారు చేస్తున్న సిబ్బంది

చింతమోటు(భట్టిప్రోలు): ప్రకృతిలో లభ్యమయ్యే ఆకులు, అలమలతో కషాయాలను తయారు చేసి పంటలను ఆశించే చీడపీడలను నివారించవచ్చునని ప్రకృతి వ్యవసాయ నిపుణులు బాలపాప తెలిపారు. వెల్లటూరు క్లస్టర్ పరిధిలోని చింతమోటు గ్రామంలోని ఎన్‌పీఎం షాపు ఆవరణలో ప్రకృతి వ్యవసాయంలో భాగంగా పంటలను ఆశించే పురుగులను సామూహికంగా అరికట్టేందుకు దశపర్ణి కషాయం తయారు చేసే విధానాన్ని సిబ్బంది మంగళవారం రైతులకు స్వయంగా చూపారు. పచ్చిమిర్చి, అల్లం, వెల్లులి, ఆవు మూత్రం, పేడ, వేపాకులు, గానుగ, ఉమ్మెత్త, బొప్పాయి, ఆముదపు ఆకులను వినియోగించి 100 లీటర్ల దశపర్ణి కషాయాన్ని తయారు చేశారు. బాలపాప మాట్లాడుతూ ఎన్‌పీఎం షాపులో పంటల ఎదుగుదల, పురుగులు, తెగుళ్ల నివారణకు చాప బెల్లం ద్రావణం, బ్రహ్మాస్త్రం, కోడిగుడ్డ, నిమ్మరసం ద్రావణం, అగ్ని అస్త్రం వంటి కషాయాలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. రైతులు వీటిని వినియోగించుకుని రైతులు అధిక దిగుబడులు సాధించాలని కోరారు. కార్యక్రమంలో ఎల్ -2 సునీత, ఐసీఆర్పీఎస్‌లు సీహెచ్ సుశీల, పి. ప్రసన్న, రేవతి రైతులు పాల్గొన్నారు.